# షూరిటీ

రాజ్ శ్రీనివాస్



వీధి మలుపు తిరుగుతూ చూశాడు శంకరం దూరంగా తన ఇంటి గుమ్మం ముందు దీనంగా కుటుంబరావు. ఈ వేళప్పుడు ఇతను తన దగ్గిరకెందుకొచ్చాడు? అనుకుంటూ నెమ్మదిగా ఇంటి వేపు నడిచాడు

కుటుంబరావు లోబడ్జెట్ సినిమాలో మధ్య తరగతి తండ్రిలా ఉంటాడు. అతని జీవితం ఏనాటికయినా ఇలా అవుతుందని ఏభై ఏళ్ళ క్రితమే ఊహించి ఆ పేరు పెట్టి ఉంటారు నిజానికి అతను పుట్టేసరికి కుటుంబరావు కుటుంబం ఇంత ఘోరమయిన స్థితిలోలేదు అతను పుట్టడం యువరాజులా పుట్టి తరవాత కొంత కళ తగ్గినా దొరబాబులాగే పెరిగేడు. అతని తండ్రి ఏనాడూ పేక ముక్కలూ, మందూ లాంటి దుర్వ్యసనాల జోలికి మాత్రం పోలేదు. కానయితే అతనికి 'అమ్మాయి'ల సర్దా ఉండేది. తరవాత ఆసర్దాల కోసం అతను 'అప్పులు' చేసేడు. తరవాత అతను ఓ రోజు హడావుడిగా ఏదో పనున్నట్టు స్వర్గం ఉంటే స్వర్గానికీ, నరకం ఉంటే నరకానికీ వెళ్లిపోయేడు. అప్పటికి కుటుంబరావుకి ఇరవైమూడేళ్ళ వయసూ, పి.యూ సీ. సర్టిఫికెట్టూ, పెళ్లికెదిగిన ఇద్దరు చెల్లెళ్ళూ, అర్జెంటుగా పెంకులు మార్చవలసిన ఇల్లు మిగిలేయి. అప్పుడు అతని మేనమావ పూనకుని ఇల్లు బేరం పెట్టి కుటుంబరావు తండ్రి చేసిన చిల్లరప్పులు తీర్చి, కుటుంబరావు చెల్లెళ్ళిద్దరికీ ఇద్దరు గంతకు తగ్గబొంతల్ని వెతికి తీసుకొచ్చి ఓగుళ్ళో వండి పెట్టేసేడు. తరవాత కుటుంబరావుకి పన్లోపనిగా తన కూతుర్నిచ్చి పెళ్ళి జరిపించేసేడు ఆ తర్వాత వాళ్ళ కాళ్ళూ వీళ్ళ కాళ్ళూ పట్టుకుని అతనికో గుమస్తా ఉద్యోగం వేయించేడు. ఇదంతా అతనికి ఏవో కలలో దృశ్యాల్లాగా, సినిమాల్లో ఫ్లాష్ బాక్ సీన్లలాగా తొందర తొందరగా జరిగిపోయేయి అంతవరకూ అతను జీవితాన్ని ఎవార్డ్ సినిమా ప్రేక్షకుళ్ళా చూసేవాడుగానీ అతనికి అదంతా అనుభవంలోకి వచ్చేసరికి అయోమయం అయిపోయింది అతనుఆ అయోమయంలోంచి తేరుకునేసరికి అతనికి ఇద్దరాడ పిల్లలూ, ఇద్దరు మగపిల్లలూ పుట్టేరు. అప్పటికి అతని పేరు పూర్తిగా సార్థకమయింది.

ఒకటో తారీఖు. .. మందులూ. . . అప్పులూ..... మళ్ళీ ఒకటో తారీఖు....

మందులూ...... అప్పులూ.... ఈలోగా పెద్దకూతురు 'పెళ్ళి' అలారం కొట్టింది తుళ్ళిపడిలేచిపడుతూ లేస్తూ ఏది సంబంధాలు వెతికి చివరికోటి ఖాయం చేసి చెయ్యగలిగినన్ని అప్పులు చేసి పెళ్ళి అయిందనిపించేడు. ఆ తర్వాత మరో మూణ్ణెల్లు పోయేక మందులు బిల్లు తగ్గిస్తూ భార్య పోయింది అప్పుడు తను దేవుళ్ళని శపించాడు. సంఘాన్ని తిట్టేడు. ఉద్యోగాన్ని అసహ్యంచుకున్నాడు. ఆబ్రతుకులోంచి పారిపోవడానికి మందునాశ్రయించేడు. మర్యాదలన్నీ వొదిలేసేడు. సరిగ్గా ఆ సమయంలో అల్లుడు అర్ధంతరంగా బతుక్కి గుడ్‌బై చెప్పెయ్యడంతో కూతురు తిన్నగా పుట్టిల్లు చేరుకుంది. అప్పట్నుంచీ కుటుంబరావు మనుషుల్లోలేడు. సరిగ్గా మూణ్ణెల్ల క్రితం పట్టపగలు తాగి ఆఫీసర్ని కొట్టినందుకు ఉద్యోగంలోంచి సస్పెండ్ చేసేరు. ఇప్పుడు ఆ ఊళ్ళో కుటుంబరావుకి డబ్బులేదు. పరపతి లేదు. మర్యాదలేదు. పరువు లేదు ఇక మిగిలిందల్లా విధవ కూతురూ, పెళ్ళికెదిగిన రెండో కూతురూ, జులాయిగా తిరుగుతున్న ఇద్దరు మగ పిల్లలూ, ఊర్నిండా అప్పులూ. .

శంకరానికీ కుటుంబరావుకీ పెద్ద స్నేహమేమీలేదు. ఒకే ఊరవడం వల్ల కుటుంబరావు అతనికి తెలుసు. ఇంట్లోకి వెళ్తూ-

"ఏవండీ కుటుంబరావుగారూ, నా కోసమేనా?" అన్నాడు శంకరం సందేహంగా.

"అవును బాబూ, నీతో కొంచెం పనుండి వచ్చేను" అన్నాడు మొహమాటంగా కుటుంబరావు.

ఈయన కొంపదీసి డబ్బులుగానీ అప్పు అడగడుగదా, తన పరిస్థితీ అంతంత మాత్రంగానే ఉంది అనుకుంటూ 'చెప్పండి' అన్నాడు.

"నువ్వే అదుకోవాలి బాబూ, నువ్వుకాదంటే మరో దారిలేదు ఉద్యోగం పోయింది. బతుక్కి మరో దారిలేదు సెంటర్లో తెలిసినాయన చిన్న షాపు ఇస్తానన్నాడు. పెట్టుబడి ఒక్కపది వేలుంటే సరిపోతుంది ప్రమాణపూర్తిగా చెప్తున్నాను బాబూ, తాగుడు మానేసాను. బాంకు మేనేజరుగారు పదివేలు లోను ఇస్తామన్నారు 'ష్యూరిటీ' కావాలన్నారు. ఎవరన్నా 'గవర్నమెంటు ఎంప్లాయి' ష్యూరిటీ ఇస్తే ఆ డబ్బు వస్తుంది. బాబూ నేను అప్పుతీర్చనన్న అపనమ్మకం మీకొద్దు ఎలాగోలా తీర్చేసుకుంటాను బాబ్బాబు నాకీ సాయం జేసి పెట్టేవంటే జన్మలో మీ మేలు మరిచిపోను ఊళ్ళో ఎందరినో అడిగాను ఎవరూ సంతకం పెట్టలేదు. నీ దయ ఏం చేస్తావో నీ ఇష్టం. అతి దీనంగా అని నమస్కారం చేసి కళ్ళ నీళ్ళే తక్కువగా నిలబడ్డాడు కుటుంబరావు. శంకరానికి జాలేసింది. కానీ తన పరిస్థితి...... అవుననడవా? కాదనడవా? తన కొచ్చే జీతం అలా బొటా బొటీగా సంసారం ఈదడానికి సరిపోతుంది. నెలనెలా వందా రెండు వందలు అప్పులు మరలాంటప్పుడు ఈయన ఒక వేళ అప్పు తీర్చకపోతే ఆ అప్పు నెత్తినబడదా? అందులో ఈ ఊళ్ళో తనేం చేసినా కాకుల్లా పొడుచుకుతినే బంధువులున్నారు. తనకిసాయం చెయ్యకపోగా ఇలాంటి గొడవల్లో ఇరుక్కున్నానంటే తలో రాయి వేస్తారు. అనుకుంటూ రేపు సాయంత్రం రండి, చూద్దాం అన్నాడు

"బాబూ, నువ్వేచూడాలి" నీ మీదే ఆశలు పెట్టుకున్నాను. నేను తాగుడు మానీసేను. తాగుడు మానకపోతే మొత్తం పిల్లలందరూ కట్టగట్టుకుని నూతిలో గెంతేస్తావని వార్నింగిచ్చేరు బాబూ, అదిగో అప్పట్నుంచీ నామీద నాకే అసహ్యం వేసి తాగుడు మానీసేను" అన్నాడు సంజాయిషీగా.

"సర్లెండి చూద్దాం రేపు రండి" అన్నాడు శంకరం కుటుంబరావు వస్తానని చెప్పి వెళ్ళిపోయేడు.

లోపలికెళ్ళేసరికి శంకరం భార్య సుమిత్ర తీవ్రంగా చూస్తూ అయితే 'ష్యూరిటీ' ఇస్తారా? అంది తుపాకీ పేల్చినట్టు.

శంకరానికి చిరాకేసింది. మాట్లాడకుండా బట్టలు మార్చుకుని భోజనానికొచ్చున్నాడు 'సుమిత్ర'కి తనేదో శాపవశాన ఈ శంకరం అనే అభాగ్యుడి భార్యనయానని ఓ నమ్మకం. అవకాశం దొరికినప్పుడల్లా ఆ విషయం వెళ్ళ గ్రక్కుతూంటుంది "మీరు ష్యూరిటీ ఇచ్చేరంటే నేను మా వాళ్ళింటికి పోతానంతే." అని అల్టిమేటం ఇచ్చి భోజనం వొడ్డించింది. శంకరం మౌనంగా భోజనం పూర్తి చేసేడు. మర్నాడు పొద్దుటే తయారయి ఆఫీసుకి వెళ్దామనేసరికి సుమిత్ర చుట్టం ఒకాయనొచ్చాడు. అతనూ ఆ ఊళ్లోనే వుంటున్నాడు. "రండ్రండి" అన్నాడు శంకరం. అతను కాసేపు ఆ కబురూ, ఈ కబురూ మాట్లాడి కాఫీ తాగి నెమ్మదిగా మొదలు పెట్టే చివరికి కుటుంబరావు మీ దగ్గరకి ష్యూరిటీ కోసం వచ్చేట్ట కదా తొందరపడి సంతకంగానీ పెట్టేకండి, రోజులసలేబాగులేవు. అతను అసలే త్రాగుబోతు అంటూ అరగంట హెచ్చరించి వెళ్లిపోయాడు ఆ రోజు అతని ఆఫీసులో ఇద్దరు ముగ్గురు అన్యాపదేశంగా హెచ్చరించేరు గతంలో 'ష్యూరిటీ'లిచ్చి ఆ డబ్బు కట్టుకున్న జాబితా అంతా చెప్పేరు అతని మేలు కోసమే అన్నారు మరొకరయితే ఇంతచెప్పనవసరంలేదన్నారు అతను అమాయకుడవడం వల్ల ఇంతచెప్పవలసొస్తుందన్నారు. శంకరానికి తల తిరిగి పోయింది. సాయంత్రం ఇంటికెళ్ళేసరికి దీనంగా కుటుంబరావు. వెనకాల పదిహేడూ, పద్దెనిమిది సంవత్సరాల కుర్రోడూ. "వీడు మా అబ్బాయి శంకరం, షాపులో వీడే ఉంటాడు. నువ్వైనా పిల్లల మొహం చూసయినా 'ష్యూరిటీ' ఇవ్వాలి.


ఆంధ్ర సచిత్ర వారపత్రిక



యువతీ యువకుల కోసం

"జాగ్రుతీ కిరణ్" కొత్త శీర్షిక


నేనేం చదవాలి?


మీరు యిప్పుడు పరీక్ష ప్యాసైపోయాక ఏం చెయ్యాలన్న అనుమానం రావొచ్చును 10 తర్వాత 12 తర్వాత, డిగ్రీ తర్వాత మీరేంచేయాలో సలహాలు యిచ్చే ప్రత్యేక కొత్త ప్రశ్నలు-జవాబులు శీర్షిక సచిత్ర వారపత్రికలో ప్రారంభిస్తున్నాము. కూపన్ పైవారమే! తప్పక చూడండి.

-ఎడిటర్

# విద్యార్థులలో అశాంతి ఎందుకు?

## సీట్లు రాక...





పై చదువులు చదువుకోవాలన్న విద్యార్థులకు కాలేజీలలో ఆర్థిక స్థోమత కారణంగా సీట్లు రాకపోవటం వారి అశాంతికి కారణమవుతోంది. ఎంతకష్టపడి చదివినా పై తరగతులలో సీటు గ్యారంటీ లేక విద్యార్థులు నిరాశకు గురవుతున్నారు.

విద్యా సంస్థలలో విద్యార్థి ఆశించిన సీటు దొరకకపోవటం, సకాలంలో పుస్తకాలు లభించకపోవటం, బంద్‌లు, తరగతుల బహిష్కరణల వంటివి విద్యార్థులలో ప్రశాంతతను కోల్పోయేలా చేస్తున్నాయి.

-కె. కళ్యాణచంద్ర, టెక్కలి.

* * *

ఎంత కష్టపడి చదివినా తోటి విద్యార్థులు డబ్బు ద్వారా కొందరు, ఎంట్రన్స్‌లు ద్వారా కొందరూ, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి మరికొందరూ పైకి వచ్చేస్తుంటే విద్యార్థులలో అశాంతి ఏర్పడుతుంది.

మరికొంతమంది విద్యార్థులకు తమ ఇంట్లో ఆర్థిక పరిస్థితులను మాటి మాటికి తలచుకొని అటు ఆర్థిక పరిస్థితులను చక్కబెట్టుకోలేక ఇటు, విద్యలోనూ అశాంతికి గురి అవుతూ ఉంటారు.

తమ మీద ఆశలు పెట్టుకొన్న తల్లిదండ్రులకు సరైన న్యాయం చేకూర్చగలమో, లేదో అనే భయంతో అశాంతికి గురి అయ్యే వారు మరికొందరైతే, డొనేషన్లు కట్టగలమో, లేదో అనే భయం మరికొందరికి.

భవిష్యత్తుపై ఎన్నో ఊహాగానాలు చేసుకొని పరీక్ష ఫీజులు కూడా కట్టుకోలేని విద్యార్థులు ఏదో విధంగా కట్టగల్గినా ఇకముందు ఎదుర్కోబోయే పరిస్థితులను తలచుకొని అశాంతికి గురి అవుతూ ఉంటారు.

-అన్నారావు.

## షూరిటీ

బతకడానికి నాకున్న ఆఖరి అవకాశం ఇది" అన్నాడు చేతులు జోడించి. కుటుంబరావు తాగుడు మొదలెట్టకముందు అందరిళ్లోనూ మొహమాటంగా నెమ్మదిగా మంచిగా ఉండేవాడు. అయితే దెబ్బమీద దెబ్బ తిని తాగుడు మొదలెట్టేక మొండితనం, తెగింపూ, చొరవా అలవాటయ్యేయి. బతుకు బిడియాన్ని దూరం చేస్తుందేమో.

శంకరం బాగా సెన్సిటివ్. కుటుంబరావు చేతులు జోడించే సరికి కదిలిపోయి 'దయచేసి అప్పు సక్రమంగా తీర్చెయ్యండి' అంటూ సంతకం పెట్టేడు. కుటుంబరావు పొంగిపోయేడు. షాపు ఓపినింగ్‌కి దగ్గరుండి తీసుకెళ్లాడు. సుమిత్ర రెండు రోజులు అలిగింది. వూళ్ళో తెలిసిన అందరూ శంకరంమీద జాలిపడ్డారు. కుటుంబరావుకి స్థిరం ఎక్కడేడిసింది. శంకరం డబ్బుకి 'నువ్వు లొ'దిలెయ్యడమే అన్నారు. ఆర్నెల్లు గడిచేయి, కుటుంబరావు ఎప్పుడు కనిపించినా శంకరాన్ని తన షాపుకి తీసుకెళ్ళి, దాని ఇబ్బందులూ, లాభాలూ అన్నీ చెప్తున్నాడు. ఇంకా ఒక్క వాయిదా కూడా కట్టలేదు. కొద్దిరోజుల్లో కొంచెం పెద్దమొత్తం అయ్యేక అప్పు కొంత చెల్లు వేస్తానని చెప్పేడు. ఒక రోజు శంకరానికి తెలిసింది. కుటుంబరావుకి కుటుంబం బాధ శాశ్వతంగా వొదిలిపోయిందని. 'హార్ట్ ఎటాక్' కుటుంబరావుని పొట్టన పెట్టుకుంది. కుటుంబరావు చావునెవరూ సీరియస్‌గా తీసుకోలేదుగానీ శంకరం 'షూరిటీ' గురించి జాలి జాలిగా కథలు చెప్పుకున్నారు. మేం ముందే చెప్పేం అండీ అతనవింటేగా అని తమ దూరదృష్టిని చాటుకున్నారు. ఇంట్లో సుమిత్ర వెంటనే ముక్కు చీదుకుంటూ పుట్టింటికిపోయింది. శంకరానికి ఈ జనమందరికీ ఏదో అయినట్లనిపించింది. నిజానికి వాళ్ళందరూ ఆర్థికంగా తనకంటే మెరుగయిన వాళ్లే. ఏ ఒక్కరయినా 'షూరిటీ' సంతకం చెయ్యొచ్చు. వాళ్ళందరికీ స్థిరాస్తులు కూడా ఉన్నాయి. ఒకవేళ కుటుంబరావు బ్రతికి ఉండి అప్పుతీర్చేస్తే వీళ్ళెవరికీ 'మనశ్శాంతి' ఉండేది కాదేమో! ఒక మనిషి దుర్మార్గమయిన పరిస్థితుల ప్రభావానికి లొంగి తప్పు తెలుసుకుని బతుకు బాగు చేసుకుందామను కుంటే ఇంతవ్యతిరేకతా? ఒక్క మనిషికి మాత్రమే సాధ్యమయిన ఈ ప్రవర్తనని మార్చడం ఎవరితరం?

మూడో రోజు సాయంత్రం పెదబావ మరిది 'సుమిత్ర'ని తీసుకుని వచ్చేడు. "బావా, కొంచెం వెనుకా ముందూ చూసుకోవాలి కదా. అది బాధపడిందని కాదుగానీ మీకూ ఖర్చులు పెరుగుతున్నాయి. పిల్లలు పెరుగుతున్నారు. ఇటువంటి పనులు చేస్తే ఎలా అంటూ మొదలెట్టి బతుకెలా మెరుగుపరచుకోవాలో చెప్పేడు. భవిష్యత్తులో మళ్ళీ ఇలాంటి పొరపాటు జరక్కుండా బాగానే గుణపాఠం జరిగిందన్నాడు. అన్నీ విని శంకరం మౌనంగా ఊరుకున్నాడు. ఎందుకంటే ఆరోజు ఉదయమే కుటుంబరావు కొడుకొచ్చి నమస్కారం చేసి చెప్పేడు. "నాన్నగారు పోతూ పోతూ అప్పు ఎలాగైనా తీర్చెయ్యమన్నారు సార్! నెమ్మదిమీద వచ్చేనెల నుంచి అప్పు కొంచెం తీర్చేస్తాం. మీ పేరు చెప్పుకొని రెండు పూటలా అన్నం తింటున్నాం" అని చెప్పి వెళ్ళిపోయేడు.

శంకరం తృప్తిగా నవ్వుకున్నాడు. మనిషి నమ్మకాన్ని మించిన 'షూరిటీ' ఏముంది. అయితే అతను ఈ విషయం ఎవరితోనూ చెప్పదలచుకోలేదు. చెప్పి జనాల్ని కన్విన్స్ చెయ్యవలసిన అవసరం ఏముంది. అవునంత మాత్రమూలేదు. ●